క్లుప్తంగా

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



జడ్చర్ల టౌన్‌: మండలంలోని చిట్టిబోయిన్‌పల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం ఎల్‌టీసీఎఫ్‌ యూనిట్‌ ఆఫ్‌ బాల్‌ఆరోగ్య సంవర్ధన్‌ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వైద్యపరీక్షలు చేశారు. ఈ వైద్యశిబిరంలో ఆ సంస్థ చైర్మన్‌ విద్యాభూషణ్‌, ఎండీ రాజేశ్వరరావు, సీఈఓ నరేందర్‌రావు సార్ల, ఏజీఎం శ్రీలత, డాక్టర్లు పూజ, మేరీ దివ్య, ప్రియదర్శిని పరీక్షలు చేసి మందులు పంపిణీచేశారు. విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్‌ అనిత, సిబ్బంది ఉన్నారు.

ఎరువులు అందించాలి



రాజాపూర్‌: రైతులకు ఇబ్బందుల్లేకుండా డీఏపీ, యూరియా తదితర ఎరువులను అందించాలని రైతు ఆగ్రోస్‌ కేంద్రాల డీలర్లను జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్‌ ఆదేశించారు. మంగళవారం రాజాపూర్‌ మండల కేంద్రంతో పాటు తిర్మలాపూర్‌ గ్రామంలోని రైతు ఆగ్రోస్‌ కేంద్రాల్లో నిల్వ ఉన్న ఎరువులను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా వెంకటేష్‌ మాట్లాడుతూ రైతుకేంద్రాల వద్దకు వచ్చిన రైతులకు అవసరమున్న ఎరువులతో పాటు వరి విత్తనాలను ప్రభుత్వ ధరలకే విక్రయించాలని డీలర్లకు సూచించారు. విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులకు రశీదు ఇవ్వాలని అన్నారు. రైతు కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌కు ఆదేశించారు. ఏఈ ప్రదీప్‌గౌడ్‌తో పాటు డీలర్లు ఉపేందర్‌రెడ్డి, ఈఓలు శ్రీనివాస్‌, దీపికాగౌడ్‌ తదితరులున్నారు.

సంఘాన్ని బలోపేతం చేస్తాం



మహబూబ్‌నగర్‌ రూరల్‌: జాతీయ మాల మహానాడు సంఘాన్ని బలోపేతం చేస్తామని జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ గోనెల ఆనంద్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌ అన్నారు. మంగళవారం మాల మహానాడు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌, స్టేట్‌ కోఆర్డినేటర్‌ బ్యాగరి వెంకటస్వామి వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్‌ మాట్లాడుతూ నిబద్ధతతో జాతి అభివృద్ధి, ఐక్యత కోసం పనిచేయాలని సూచించారు.

కుక్కల తరలింపు



జడ్చర్ల టౌన్‌: స్థానిక 12వ వార్డులో మంగళవారం కుక్కలను పట్టుకుని తరలించారు. బందర్‌ నుంచి వచ్చిన నిపుణులు శ్రీనివాసనగర్‌, గాంధీనగర్‌లో మొత్తం 20కిపైగా కుక్కలను పట్టుకుని వ్యాన్‌లో తీసుకెళ్లారు. కుక్కలు అధికంగా ఉన్నాయని పగలు, రాత్రిళ్లు కాలనీల్లో తిరగనివ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయని ఫిర్యాదులు అందినట్లు కౌన్సిలర్‌ రఘురాంగౌడ్‌ తెలిపారు. ఈ మేరకు కుక్కల తరలింపునకు చర్యలు తీసుకున్నామన్నారు. మరికొన్ని ప్రాంతాల్లోనూ కుక్కలను పట్టుకుని మహబూబ్‌నగర్‌కు స్టెరిలైజేషన్‌కోసం తరలించినట్లు మున్సిపల్‌ కమిషనర్‌ లక్ష్మారెడ్డి తెలిపారు.

బూట్లు పంపిణీ

నవాబుపేట: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌, పోమాల్‌, పుట్టోనిపల్లి, హాజిలాపూర్‌, దయాపంతులపల్లి గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఎమ్మెల్యే సోదరుడు దుశ్యంత్‌రెడ్డి బూట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో దాదాపుగా 5000 మందికి పైగా ఉన్న విద్యార్థులందరికీ షూలు అందిస్తామని తెలిపారు. మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ లింగం, ఎంఈఓ నాగ్యానాయక్‌, వెంకటేష్‌గౌడ్‌, వాసుయాదవ్‌, రాజేష్‌, రమేష్‌గౌడ్‌, అంజన్‌కుమార్‌, వెంకటయ్య, సంతోష్‌, శంకర్‌నాయక్‌, తిరుపతయ్య ఉన్నారు.

ఆర్థికసాయం

గండేడ్‌: మండలంలోని పెద్దవార్వాల్‌ గ్రామానికి చెందిన రాములమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం పెద్దవార్వాల్‌ మాజీ సర్పంచ్‌ నరసింహరావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్‌ నాయకులు వీరన్న, వెంకటేశం పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి



జడ్చర్లలో అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు

- లగచర్ల రైతులకు మద్దతుగా నిరసన
- అంబేడ్కర్‌ విగ్రహాలకు వినతిపత్రాలు

సాక్షి నెట్‌వర్క్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వం లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్‌ చేస్తూ బీఆర్‌ఎస్‌ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ఆ పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం పలుచోట్ల నాయకులు మాట్లాడుతూ లగచర్ల రైతులకు న్యాయం జరిగేంతవరకు పోరాటాలు కొనసాగుతాయని అన్నారు.

■ జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో అంబేడ్కర్‌ విగ్రహానికి బీఆర్‌ఎస్‌ నాయకులు వినతిపత్రం సమర్పించారు. జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్‌ కోడ్గల్‌ యాదయ్య, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పుష్పలత, వైస్‌ చైర్‌పర్సన్‌ సారిక, వార్డు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

■ భూత్పూర్‌ మండలంలోని చౌరస్తా నుంచి అంబేడ్కర్‌ విగ్రహం వరకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వచ్చి అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ చంద్రమౌళి, చైర్మన్‌ బస్వరాజ్‌గౌడ్‌, కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్‌ ఎంపీపీ నరేష్‌గౌడ్‌, ఆంజనేయులు, శ్రీను, నాయకులు నారాయణగౌడ్‌, నర్సింహులుగౌడ్‌, రామునాయక్‌, సురేష్‌గౌడ్‌, కదిరె అశోక్‌రెడ్డి, జాకీర్‌, బాల్‌రెడ్డి, యాదయ్య, సత్యం పాల్గొన్నారు.

■ మహమ్మదాబాద్‌ మండలంలోని నంచర్లలో బీఆర్‌ఎస్‌ నాయకులు అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందించారు. గండేడ్‌, మహమ్మదాబాద్‌ మండలాల బీఆర్‌ఎస్‌ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పెంట్యానాయక్‌, బిక్షపతి, రఘు, తిర్మల్‌రెడ్డి, సాబేర్‌, కిష్టయ్య, హన్మయ్య ఉన్నారు.

■ అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్‌ నాయకులు అంబేడ్కర్‌ విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేస్తూ వినతిపత్రాలను అందజేశారు. మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్‌, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సింహ్మాయాదవ్‌, జితేందర్‌రెడ్డి, జయన్నగౌడ్‌, కొండయ్య, అనిల్‌రెడ్డి, రవీందర్‌గౌడ్‌, బాలరాజు, మహేష్‌యాదవ్‌, శ్రీనివాస్‌యాదవ్‌ ఉన్నారు.



మహమ్మదాబాద్‌ మండలం నంచర్లలో..

■ చిన్నచింతకుంట మండలం ఉంద్యాల గ్రామంలో బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్టాండ్‌ కూడలిలో అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

■ దేవరకద్రలో కాంగ్రెస్‌ ప్రభుత్వ చర్యలకు నిరసనగా బీఆర్‌ఎస్‌ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రమిచ్చారు. జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్‌, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, చల్మారెడ్డి, కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌, శ్రీనివాస్‌, తిరుపతయ్య, రమేశ్‌గౌడ్‌, బాల్‌రాజు, జగన్‌ తదితరులు పాల్గొన్నారు.



భూత్పూర్‌ చౌరస్తాలో అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

డబ్లింగ్‌ పనులకు సహకరించాలి: ఆర్డీఓ



దేవరకద్ర: మండలంలో రైల్వే డబ్లింగ్‌ పనులు చేపట్టడానికి అధికారులు సహకరించాలని ఆర్డీఓ నవీన్‌ కోరారు. మంగళవారం దేవరకద్ర తహసీల్దార్‌ కార్యాలయంలో రైల్వే, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. సమావేశంలో తహసీల్దార్‌ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌చాలీసా పారాయణం



జడ్చర్ల టౌన్‌: మండలంలోని గంగాపురం సమీపంలోని లక్ష్మీనారాయణ ఆశ్రమంలో మంగళవారం పట్టణానికి చెందిన మహిళా భక్తులు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. హనుమంతుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ పీఠాధిపతి పరమాత్మనందగిరిస్వామి ఆధ్వర్యంలో నూతన ఏడాది క్యాలెండర్‌ ఆవిష్కరించారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం



దేవరకద్ర: పట్టణాభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కృషిచేస్తున్నారని కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఫారూఖ్‌, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల నాయకులు అంజన్‌కుమార్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జవహర్‌, వర్మ తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే చేసిన కృషి ఫలితంగానే రైల్వే సబ్‌వే మంజూరైందన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

జడ్చర్ల టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని బీసీ జాగృతిసేన మండల ప్రధాన కార్యదర్శి నర్సింహులు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ప్రతి నియోజకవర్గానికి 3000 ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించటాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు.

పోరాటాల్లో దర్గయ్య నాయక్‌ పాత్ర కీలకం

మహబూబ్‌నగర్‌ న్యూటౌన్‌: వీరతెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల్లో సీనియర్‌ కమ్యూనిస్టు దర్గయ్యనాయక్‌ పాత్ర కీలకమని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కురుమయ్య, ప్రశాంత్‌, నందు, ప్రవీణ్‌ అంజనేయులు, భాస్కర్‌ పాల్గొన్నారు.

ప్రతిభ చాటి పతకాలు సాధించాలి



ఎంపికలను ప్రారంభిస్తున్న జిల్లా అథ్లెటిక్స్‌ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర

మహబూబ్‌నగర్‌ క్రీడలు: క్రాస్‌కంట్రీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి పతకాలు సాధించాలని జిల్లా అథ్లెటిక్స్‌ సంఘం కార్యదర్శి జి.శరత్‌చంద్ర ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాల మైదానంలో మంగళవారం జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ పరుగు ఎంపికలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్ర మాట్లాడుతూ జిల్లాస్థాయి ఎంపికల్లో జిల్లా వ్యాప్తంగా దాదాపు 80మంది బాల, బాలికలు హాజరైనట్లు తెలిపారు. అండర్‌–16 ఏళ్లలోపు బాల, బాలికలకు 2కేఎం, 18 ఏళ్లలోపు బాలికలకు 4కేఎం, బాలురకు 6కేఎం, 20 ఏళ్లలోపు బాలికలకు 6కేఎం, బాలురకు 8కేఎం, మహిళలు, పురుషులకు 10కేఎం పరుగు పోటీల్లో ఎంపికలు నిర్వహించామన్నారు. కల్వకుర్తిలో ఈనెల 22వ తేదీన 10వ రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లా ఫుట్‌బాల్‌ సంఘం కార్యదర్శి భానుకిరణ్‌, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అథ్లెటిక్స్‌ సంఘం సభ్యులు సి.శ్రీనివాసులు, కోచ్‌లు ఆనంద్‌, ఎం.శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ క్రిస్టియన్‌ మైనార్టీ పట్టణ అధ్యక్షుడిగా శామ్యుల్‌



శామ్యుల్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

మహబూబ్‌నగర్‌ క్రీడలు: కాంగ్రెస్‌ పార్టీ క్రిస్టియన్‌ మైనార్టీ పట్టణ అధ్యక్షుడిగా దాసరి శామ్యుల్‌ ప్రభాకర్‌ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సామ్యుల్‌కు నియామకపత్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ అందజేశారు. పట్టణంలో క్రిస్టియన్‌ మైనార్టీ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. నాయకులు రాఘవేందర్‌ యాదవ్‌, శ్యామ్‌ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమయ స్ఫూర్తితో..

- సాఫీగా సాగిన కార్యక్రమాలు

గండేడ్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ అంబేడ్కర్‌ విగ్రహాలకు వినతిపత్రాలు.. కాంగ్రెస్‌ పార్టీ అంబేడ్కర్‌ విగ్రహం ముందు విలేకర్ల సమావేశం ఓ వివాదస్పదమయ్యే అంశం. కానీ పోలీసు ఉన్నతాధికారుల సూచనలు, స్థానిక పోలీసుల సమయస్ఫూర్తితో ఈ రెండు కార్యక్రమాలు సాఫీగా సాగాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లగచర్ల ఘటనపై మంగళవారం అంబేడ్కర్‌ విగ్రహాలకు వినతిపత్రాలు ఇవ్వాలని బీఆర్‌ఎస్‌ పార్టీ అధిష్టానం పిలుపునిచ్చింది. ఈమేరకు ఉమ్మడి గండేడ్‌ మండలాల పార్టీ శ్రేణులు అందుకు సిద్ధమయ్యాయి. గండేడ్‌ మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిర్వహించాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ పార్టీ నాయకులు ఉదయం అంబేడ్కర్‌ విగ్రహం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహిస్తామని రాత్రికి రాత్రే టెంట్‌ వేయించారు. దీంతో విషయం రాద్ధాంతమైంది. గమనించిన స్థానిక ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సీఐ గాంధీనాయక్‌, హన్వాడ ఎస్సై వెంకటేశ్‌ సిబ్బందితో కలిసి మంగళవారం ఉదయం గండేడ్‌కు చేరుకున్నారు. బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీ నాయకులతో మాట్లాడారు. ఇరుపార్టీల వారు వేరువేరుగా తమ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని కోరారు. మొదట వారు ససేమిరా అన్నారు. పోలీసులు నచ్చజెప్పడంతో అంగీకరించారు. బీఆర్‌ఎస్‌ నాయకులు నంచర్లో అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీ వారు వెన్నాచేడ్‌లో అంబేడ్కర్‌ విగ్రహం వద్ద విలేకర్ల సమావేశం పెట్టారు. గండేడ్‌లో వేసిన టెంట్‌ను తొలగించారు.

భక్తులకు సేవ చేసుకోవడం అదృష్టం



అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న గురుస్వాములు

రాజాపూర్‌ (బాలానగర్‌): అయ్యప్ప స్వామి భక్తులకు సేవ చేసుకోవడం ఎంతో అదృష్టమని అయ్యప్పస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాలానగర్‌ మండలంలోని దుందుభీ నది ఒడ్డున వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పమాలధారులకు, భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన అయ్యప్ప మాలధారులకు 41రోజుల పాటు నిత్యాన్నదానం చేయడం కొన్నేళ్లుగా ఆనవాయితీగా మారిందన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధానకార్యదర్శి, విశ్రాంత డీఎస్పీ సాయరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరిగౌడ్‌, ఆలయ కమిటీ డైరెక్టర్‌ లక్ష్మీనారాయణగౌడ్‌, గురుస్వాములు శ్రీనివాసులు, మహేందర్‌రెడ్డి, గణేష్‌గౌడ్‌, శివకుమార్‌, తిరుపతి, దత్తుకుమార్‌ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మహమ్మదాబాద్‌: విద్యార్థులను మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈఓ రాజునాయక్‌ ఆదేశించారు. మంగళవారం గాదిర్యాల్‌, ఆముదాలగడ్డ తండా, దేశాయిపల్లి పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలని అన్నారు. ఉపాధ్యాయులు తరగతుల అభ్యసనను మెరుగుపర్చాలని సూచించారు.

పల్లెల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: పల్లెల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలం వేముల, దాసర్‌పల్లిలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన హైమాస్ట్‌ లైట్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎస్‌జీడీ కోజెంట్‌ గ్లాస్‌ కంపెనీ ఆధ్వర్యంలో 44వ నంబర్‌ జాతీయ రహదారి నుంచి వేముల రోడ్డుపక్కన ఏర్పాటుచేయించిన లైట్లను పరిశ్రమ సీఈఓ దీపక్‌సూద్‌తో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు పరిశ్రమ వద్ద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. దాసర్‌పల్లికి చెందిన కాంగ్రెస్‌ నాయకుడు బుచ్చన్న ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్‌, బాలనర్సింహులు, బగ్గి కృష్ణయ్య, యాట సత్యం, సుధాకర్‌ ఉన్నారు.



వేములలో హైమాస్ట్‌ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

విద్యార్థినులు చదువుపై దృష్టి సారించాలి

- డీఈఓ ప్రవీణ్‌కుమార్‌

నవాబుపేట: విద్యార్థినులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆయన సందర్శించారు. పాఠశాలలో వసతులు, భోజనం, విద్యా బోధనపై ఆరాతీశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో వంద శాతం ఉతీర్ణతతో పాటు 10 జీపీఏ సాధించాలన్నా లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థినులు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. తాజాగా ప్రభుత్వం కాస్మోటిక్‌ చార్జీలు సైతం పెంచిన విషయం ఆయన గుర్తు చేశారు. చలి నుంచి రక్షణ కోసం విద్యార్థినులకు ఉలన్‌ రగ్గులు అందించారు. ఆయన వెంట ఎంఈఓ నాగ్యానాయక్‌, సీఆర్పీ జనార్దన్‌ తదితరులు ఉన్నారు.



నవాబుపేటలో విద్యార్థినులకు రగ్గులు అందిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్‌

నాణ్యమైన భోజనం అందించాలి

రాజాపూర్‌(బాలానగర్‌): విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. మంగళవారం బాలానగర్‌ మండలంలోని చెన్నంగులగడ్డ వద్ద ఉన్న కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. భోజనం టైంకి అందిస్తున్నారా.. లేదా అంటు విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. బాలానగర్‌ ఎంఈఓ శంకర్‌ ఉన్నారు.

నూతన ఉపాధ్యాయులకు వేతనాలివ్వాలి

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: ఇటీవలే నియమితులైన ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలివ్వాలని టీఎస్‌యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్‌, వెంకటేష్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం డీఈఓ ప్రవీణ్‌కుమార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త టీచర్లకు సీఎం రేవంత్‌రెడ్డి అక్టోబర్‌ నెలలో నియామక ఉత్తర్వులు ఇస్తే ఇప్పటివరకు వేతనాలు ఇవ్వకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్లమెంట్‌ ఎన్నికలకు సంబంధించిన సెలవులను మంజూరు చేయాలని, డీఈఓ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉమాదేవి, భాస్కర్‌, అజయ్‌, హేమంత్‌కుమార్‌, మన్యం, కిష్ణునాయక్‌ పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీటిని వదలాలని వినతి

నవాబుపేట: ఆయకట్టుదారులకు నీటిని వదలాలని లోకిరేవు, యన్మన్‌గండ్ల, చౌడూర్‌ చెరువుల ఆయకట్టు రైతులు మంగళవారం తహసీల్దార్‌ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ మూడు చెరువులు పూర్తిగా నిండటంతో వాటి పరిధిలోని ఆయకట్టుదారులకు నీటి విడుదల చేయాలని వారు కోరారు. జిల్లా అధికారులు చెప్పిన నిబంధనల ప్రకారం నడుచుకోవాలని తహసీల్దార్‌ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా చౌడూర్‌ గ్రామంలో రైతులతో సమావేశమైన అధికారులు వారి సూచనల మేరకు నీటి విడుదలపై తీర్మానం చేశారు. లోకిరేవు రైతులు తమ తీర్మానపత్రంలో ఆయకట్టుదారులకు కాకుండా మిగతావారికి నీటి విడుదల నిలిపివేయాలని రెవెన్యూ అధికారులను కోరారు.

మురికి కాల్వ నిర్మాణపనులు ప్రారంభం



జడ్చర్ల టౌన్‌: మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో చేపట్టిన మురికి కాల్వ నిర్మాణ పనులను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పుష్పలత మంగళవారం ప్రారంభించారు. ఈ పనులకు చైర్‌పర్సన్‌ భూమిపూజ చేశారు. ప్రతి వార్డులోనూ 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.4లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వార్డు కౌన్సిలర్‌ కుమ్మరి రాజు, ఇతర కౌన్సిలర్లు రఘురాం, ప్రశాంత్‌రెడ్డి, సతీష్‌, విజయ్‌, జ్యోతి, లత, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

'కమీషన్ల పార్టీ బీఆర్‌ఎస్‌'

గండేడ్‌: బీఆర్‌ఎస్‌ కమీషన్ల పార్టీ అని గండేడ్‌, మహమ్మదాబాద్‌ మండలాల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ ఆరోపించారు. మంగళవారం గండేడ్‌ మండలంలోని వెన్నాచేడ్‌లో అంబేడ్కర్‌ విగ్రహం వద్ద వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పలు పథకాల లబ్ధిదారుల ఎంపికలో బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడ్డారని, అందుకే ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పారని వారు విమర్శించారు. లగచర్ల ఘటనకు బీఆర్‌ఎస్‌ వారే కారణమన్నారు. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు వారికి లేదన్నారు. కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఆశిరెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ చిన్నయ్య, సాయితేజారెడ్డి, ఆశన్న, టీక్యా, వెంకట్‌రాంరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

వరద నీరు రాకుండా చూస్తాం

- మున్సిపల్‌ చైర్మన్‌ ఆనంద్‌కుమార్‌గౌడ్‌

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: ఎక్కడా వరద నీరు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని మున్సిపల్‌ చైర్మన్‌ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్‌ అన్నారు. మంగళవారం తొమ్మిదో వార్డు పరిధిలోని మర్లు ప్రాంతంలో ఆయన పర్యటించారు. వివిధ కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వరద నీటితో పాటు మురుగు మొత్తం రోడ్లపైకి వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం జీజీహెచ్‌ ఆవరణలోని నిరాశ్రయుల కేంద్రం పరిశీలించారు. భవనంపై నీరు నిలిచి గోడలు తడిసిపోతుండటాన్ని గమనించి వెంటనే మరమ్మతు చేయించాలని ఇంజినీరింగ్‌ అధికారులకు సూచించారు. ఎంసీహెచ్‌ వద్ద హైమాస్ట్‌ లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పాలకొండ ప్రాథమిక పాఠశాలలో వేసిన కొత్త బోరును ప్రారంభించారు. మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ షబ్బీర్‌అహ్మద్‌, ఎంఈ యు.బస్వరాజ్‌, డీఎంసీ శివకుమార్‌గౌడ్‌, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, స్థానికులు పాలకొండ శ్రీను, చారి, గోవింద్‌రెడ్డి, యూనుస్‌, భీమాచారి, రఘు, ఫయాజ్‌, లక్ష్మణ్‌, పటేల్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఎరుకలి శ్రీను, నందు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా కాళికాదేవి బోనాల

మహబూబ్‌నగర్‌ రూరల్‌: మండలంలోని రామచంద్రాపూర్‌ గ్రామంలో మంగళవారం శ్రీ కాళికాదేవి ఉత్సవాల్లో భాగంగా బోనాలను ఘనంగా నిర్వహించారు. అలంకరించిన బోనం కుండలతో మహిళలు గ్రామం నుంచి ఊరేగింపుగా గుట్టపైన ఉన్న కాళికాదేవి దేవస్థానం వద్దకు చేరుకున్నారు. అక్కడ దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. దేవస్థాన నిర్వాహకులు కుర్వఆనంద్‌తో పాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



బోనం కుండలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నేడు సిడే

ఎల్లమ్మ దేవత సిడే కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించనున్నారు. దీనికి గాను నిర్వాహకులు అన్ని ఏర్పాట్లుచేశారు. అమ్మవారి తేరు మైదానంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.